

పార్కు స్థలం కబ్జా చేస్తున్నారని నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

పోలీసులు సాంకేతికతలో పట్టు సాధించాలి

- సీపీ గౌస్ ఆలం



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

కరీంనగర్ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పోలీసులు నూతన సాంకేతికతపై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశించారు. నగరంలోని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, సిబ్బందికి అందించిన కిట్లను తనిఖీ చేసి వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తిస్థాయిలో పట్టు సాధించి రోజువారి విధుల్లో వినియోగించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి, రూరల్ ఎస్ఐలు లక్ష్మారెడ్డి, తాండ్ర నరేష్ పాల్గొన్నారు.

బాబోయ్ కోతులు



- ఇళ్లల్లోకి గుంపులుగా చొరబాటు
- అడ్డుకునే వారిపై దాడులు
- హుజురాబాద్‌లో ఒకరిపైదాడి, చికిత్స పొందుతూ మృతి
- కరీంనగర్‌లో స్కూల్ విద్యార్థిపై దాడి, తీవ్ర గాయాలు

కరీంనగర్ క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): కోతుల బెడద తీవ్రమవుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోతుల గుంపులు పట్టణాలు, పల్లెలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటిగా మారింది. గుంపులు గుంపులుగా ఇళ్ళల్లోకి చొరబడి వస్తువులు, ఆహార పదార్థాలు, పండ్లు ఎత్తుకుపోవటం, చిందరవందర చేయటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా గుంపులు, గుంపులుగా తిరుగుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు కోతుల బెడదతో అల్లాడిపోతున్నాయి. అడవులను వదిలి గుంపులుగా జనవాసాల్లోకి వస్తున్నాయి. ప్రజలపై దాడి చేయడమే కాకుండా గ్రామాలలో వివిధ పంటపొలాలను నాశనం చేస్తున్నాయి. పొద్దంతా వానరాల బెడద, రాత్రి అయితే అడవి పందులు, ఎలుగుబంట్లు సంచారంతో పల్లె ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు. పిల్లలపై దాడి చేసి వారి చేతుల్లో పండ్లు, బిస్కెట్లు ఉంటే వాటిని లాక్కెళుతున్నాయి. ఇబ్బందులను అటవీ శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అడవి పందుల వల్ల దెబ్బతిన్న పంటలకు సర్కారు నష్టపరిహారం ఇస్తుంది. కానీ కోతుల విధ్వంసం వల్ల దెబ్బతిన్న రైతులకు ఇది వర్తింపచేయటంలేదు. కోతులు వన్యప్రాణుల కిందకి రానందున వాటి తరలింపు, వాటి దాడితో బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో ఎటువంటి సాయం అందించే అవకాశం లేదని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. కోతుల బెడదను నివారించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఇటీవల తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో తెలంగాణ ప్రభుత్వం వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది, కానీ సమస్య శాశ్వత నివారణకు చర్యలు తీసుకోలేదు.

● ప్రజల రక్షణ చర్యలు

కోతుల బెడదకు చెక్ పెట్టేందుకు కరీంనగర్‌వాసులు కొండముచ్చుల ఫ్లెక్సీలను ఇంటి గేట్ల ముందు ఏర్పాటు చేసుకున్నారు. ఫ్లెక్సీల ఏర్పాటుతో కోతుల బెడద కాస్త తగ్గిందని వారు చెపుతున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, కొన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా కొండముచ్చు ఫొటోలతో పెద్ద పెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని సంస్థలు, గోదాంల వద్ద ఏకంగా కొండముచ్చులను కోతులను రాకుండా ఏర్పాటు చేసుకున్నారు. ఒక కొండముచ్చుకు 5 నుంచి 10 వేల వరకు ఖర్చు అయినప్పటికీ కోతుల బెడదను నివారించేందుకు ఇటువంటి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



లక్ష్మీనగర్‌లో ఓ ఇంటిగేటుకు కొండముచ్చు ఫ్లెక్సీ

"హుజురాబాద్‌లో ఇటీవల ఒక ప్రైవేట్ ఉద్యోగిపై కోతుల గుంపు దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్ది రోజుల కిందట ఆయన మరణించాడు. కరీంనగర్‌లోని ఒక ప్రభుత్వ పాఠశాలపై కోతుల గుంపు ఇటీవల దాడిచేయగా ఒక విద్యార్థి భయంతో మొదటి అంతస్తు నుంచి కిందకు దూకడంతో ఆ విద్యార్థికి తీవ్రగాయమై ఆసుపత్రిపాల య్యాడు. కరీంనగర్‌లోని పలు చోట్ల కోతుల దాడుల్లో పలువురు గాయాలపాలయ్యారు. వాహనాలపై వెళుతున్న సమయంలో ఒక్కసారిగా కోతులుపై పడటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామాలలో కూడా కోతులబారినపడి పలువురు రైతులు గాయపడ్డారు. ఇక దేవాలయాలు, పార్కులు, శివారు ప్రాంతాల్లో కోతులబెడద మరింత తీవ్రమైంది. కోతుల బారినుంచి రక్షించేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు."

● కోతులను పట్టుకోవడంలో అనాసక్తి

కోతులను పట్టుకుని వాటికి సంతాన నిరోధక ఆపరేషన్లు (మిగతా 8వ పేజీలో)

పార్కు స్థలం కబ్జాకు యత్నం

- కాలనీవాసుల ఆందోళన
- కాపాడాలని అధికారులకు వినతి

కరీంనగర్ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్ పరిధిలోని శ్రీపురం కాలనీలో పార్కు స్థలాన్ని కబ్జాకు యత్నిస్తున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్కు స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని శుక్రవారం కాలనీవాసులు పార్కు స్థలం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 1993లో సాయి ఎన్‌క్లేవ్ పేరిట రాజేశ్వర్‌రావు అనే వ్యక్తి సర్వే నెంబర్ 38, 39లో 9ఎకరాల 6గుంటల్లో వంద ప్లాట్లు చేసి విక్రయించారన్నారు. గ్రామ పంచాయతీ లేఅవుట్ ప్రకారం 18గుంటల 51 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించి ప్లాటింగ్ చేశారని తెలిపారు. గ్రామ పంచాయతీ నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ అయిన పార్కు స్థలంలో కొందరు కాంపౌండ్ నిర్మాణం చేయడానికి యత్నిస్తున్నారని తెలిపారు. కాలనీవాసుల కోసం పార్కు స్థలాన్ని వాకింగ్ ట్రాక్ ఇతర ఆటలకు సంబంధించిన అభివృద్ధి పనులు చేయడానికి కాలనీ అభివృద్ధి కమిటీ ద్వారా పనులు చేపడుతుండగా కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

గెలిచే వారికే టికెట్లు

- నాకు గ్రూపులను ఆపాదించొద్దు
- పంచాయతీలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిందేమీ లేదు
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే అవకాశమున్న నాయకులకు మాత్రమే టిక్కెట్లు వస్తాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, గెలుపు కార్యాచరణపై ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తూ ప్రజల్లో మంచి పలుకుబడి ఉన్న నేతలకు టిక్కెట్లు ఇవ్వడమే కాకుండా వారిని గెలిపించుకునే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. భారతీయ జనతా పార్టీలో ఏ గ్రూపు లేదని, ఉన్నదల్లా మోదీ గ్రూప్ మాత్రమేనని అదే బీజేపీ గ్రూప్ అని స్పష్టం చేశారు. తనకు గ్రూపులు ఆపాదించొద్దని, ఎవరైనా బండి సంజయ్ గ్రూప్ అని, మరో గ్రూపు వాళ్లమని ప్రచారం చేసుకుంటే వారికి టిక్కెట్లు కూడా రావని హెచ్చరించారు. వ్యక్తి కోసం పనిచేస్తే ప్రోత్సహించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి అనుకూల వాతావరణం ఉందన్నారు. గ్రామ పంచాయతీలకు 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో, 19 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రత్యేకించి జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. కేంద్రం ఇస్తున్న నిధులతోనే పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అదనంగా ఎంపీ లాడ్స్ నిధులు, సీఐఆర్ఎఫ్, జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ పంచాయతీలు, మండలాల్లో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో నగర మాజీ మేయర్ సునీల్‌రావు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

6 స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి

7 బైపాస్ స్థానంలో బిల్డ్ నౌ
- ఏఐ టెక్నాలజీతో భవన నిర్మాణాలకు అనుమతి
- ఆగస్టు నుంచి అమల్లోకి

అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



పర్లపల్లిలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల ఉత్తర్వుల కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందజేస్తామని, రేషన్‌కార్డుల దరఖాస్తులు, జారీ నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పర్లపల్లి గ్రామంలో రైతు వేదికలో పర్లపల్లి, నల్లగొండ, మొగిలిపాలెం, పోలంపల్లి గ్రామాల ప్రజలకు కొత్త రేషన్ కార్డుల మంజూరు ఉత్తర్వుల కాపీలను కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా సాగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అండగా నిలుస్తోందని, వివిధ ప్రభుత్వ పథకాలను మహిళల కోసం ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందని తెలిపారు. ఈ ఏడాది 150 స్వయం సహాయక సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 78వేలకు పైగా రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, తిమ్మాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా శుక్రవారం సభ

- కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి


కరీంనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శుక్రవారం సభ వేదికగా మహిళలకు కావాల్సిన అన్ని రకాల సహాయం, సమాచారం ఇస్తున్నామని, వారి సమస్యకు పరిష్కారం మార్గం చూపుతున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం సభ ద్వారా మహిళల హక్కులు, చట్టాలు, వారికి ఉన్న సదుపాయాలు, సౌకర్యాలను అధికారులు తెలియజేస్తారని అన్నారు. సభలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. 40 రకాల పరీక్షలను ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అడిషనల్ డీఎంహెచ్‌వో సుధా, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, సీడీపీవో సబిత, అధికారులు పాల్గొన్నారు.

● ప్రత్యేక అవసరాలున్న పిల్లలను భవిత కేంద్రాలకు పంపాలి

ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను జిల్లాలో ఉన్న వివిధ భవిత కేంద్రాలకు పంపించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం నగరంలోని ముకరంపుర భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలున్న 38 మంది పిల్లల తల్లిదండ్రులకు టీఎల్ఎం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అలీంకో సంస్థ ద్వారా గతంలో ప్రత్యేక అవసరాలు ఉన్న భవిత కేంద్రంలోని విద్యార్థుల కోసం క్యాంపు నిర్వహించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1485 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉండగా కొంతమంది మాత్రమే భవిత కేంద్రాలకు పంపిస్తున్నారని తెలిపారు. భవిత కేంద్రాల్లో అనుభవజ్ఞులైన ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు వివిధ పద్ధతుల ద్వారా బోధిస్తారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను భవిత కేంద్రాలకు పంపించాలని, వారి బాధ్యతను ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, విద్యాశాఖ కో-ఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్, ఆంజనేయులు, అశోక్ రెడ్డి, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని రాగి జావ

- అందించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి



కరీంనగర్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ఉదయం పోషక విలువలతో కూడిన ఆహారం అందించడమే లక్ష్యంగా గత ఏడాది ప్రభుత్వం పీఎం పోషణ్ ద్వారా పాఠశాలల్లో రాగి జావ పంపిణీ ప్రారంభించింది. గత విద్యాసంవత్సరం ఏప్రిల్ వరకు విద్యార్థులకు రాగి జావ అందించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడిచినా జావ పంపిణీ చేయడం లేదు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నుంచి అందాల్సిన రాగి పిండి, బెల్లం పాఠశాలలకు ఇంకా పంపిణీ కాలేదు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చదువుకునే విద్యార్థులకు వీరికి ప్రతి రోజు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. వారంలో మూడు రోజులు గుడ్డు, మరో మూడు రోజులు ఉదయం రాగి జావ అందించే వారు. ఇందుకు ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, బెల్లంతో కలిపి మరగబెట్టిన జావను తీసుకోవడం ద్వారా, పిల్లలో ఆకలి బాధ తీరడంతో పాటు, పోషకాలు అందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చురుగ్గా ఉండేందుకు రాగి జావ ఎంతో ఉపయుక్తమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం రాగి జావ అందించకపోవడంతో దూర ప్రాంతాల నుంచి బడికి వచ్చే విద్యార్థులు ఉద్యం ఆకలితో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయాన్నే వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుంటారు. సమయానికి ఇంటి వద్ద వంట కాక, బడిలో రాగి జావ లేక విద్యార్థులు ఆకలికి అలమటిస్తున్నారు. విద్యార్థులకు ఉపయోగపడే మంచి కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. రాగి జావ పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, పిండి, బెల్లం వస్తే పాఠశాలలకు సరఫరా చేసి అమలయ్యేలా చూస్తామని జిల్లా విద్యాధికారులు తెలుపుతున్నారు.

హుజూరాబాద్ బీజేపీలో వర్గ పోరు

- పార్టీకి రాజీనామా చేసిన నియోజకవర్గ కన్వీనర్ గౌతమ్‌రెడ్డి
- వీణవంకలో ఈటల వర్గీయుల ప్రత్యేక సమావేశం

హుజూరాబాద్/వీణవంక, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ వర్గ పోరు మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీలో రాజీ నామాల పర్వం మొదలైంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రెండు రోజుల క్రితం హుజూరాబాద్ పట్టణంలో పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలోనే బీజేపీ హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి ఈటల వర్గానికి చెందిన తమను పార్టీ కార్యక్రమాలకు పిలవడం లేదని, పార్టీలో తమకు గుర్తింపు లేదని ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడంతో చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా ఈటల వర్గం, బండి సంజయ్ వర్గీయులు సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు పోస్టులు పెడుతున్నారు. స్థానిక సంస్థల టిక్కెట్లు ఎవరు ఇస్తారనే దానిపై హుజూరాబాద్ నియోజవకవర్గంలోని బీజేపీ నాయకుల్లో ఆందోళన మొదలైంది. పార్టీ కోసం కష్టపడ్డ వారికి టిక్కెట్లు దక్కుతాయని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బాహాటంగా చెప్పారు. ఈ క్రమంలో వీణవంక మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ వర్గీయులు శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. శనివారం ఈటలను కలిసి తమను బండి సంజయ్ వర్గం దూరం పెడుతోందని ఈటలకు ఫిర్యాదు చేయనున్నారు. ఈ సమావేశంలో నాయకులు మాడ గౌతమ్‌రెడ్డి, పెద్ది మల్లారెడ్డి, మారముళ్ల కొంరయ్య, ఎనగంటి శ్రీనివాస్, తిరుమల్, గాలేటి సురేందర్ రెడ్డి, బొబ్బల విజయ్, దాసారపు రాజు, కర్రె నాని తదితరులు సమావేశంలో ఉన్నారు.



వీణవంకలో సమావేశమైన ఈటల వర్గీయులు

ఎన్టీపీసీలో గంజాయి పట్టివేత

జ్యోతినగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో గురువారం రాత్రి గంజాయిని పట్టుకున్నారు. మేడిపల్లి సెంటరులో వాహనాలు తనిఖీచేస్తున్న క్రమంలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరు యువకులను ఆపారు. వాహనంలో తనిఖీ చేయడంతో 100గ్రాముల గంజాయి దొరికింది. పట్టుబడిన ఇద్దరుయువకులు పారిపోయారు. వారిలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొల్లి అజయ్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఇతర నిందితుల కోసం గాలిస్తున్నామని ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. స్కూటీతోపాటు మరో వాహనాన్ని సీజ్‌చేసినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మున్సిపల్ నాలాలో పసికందు మృతదేహం

కోల్‌సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెడికల్‌కళాశాల సమీపంలోని రాజలక్ష్మికాలనీ వద్ద గల మున్సిపల్ నాలాలో శుక్రవారం పసికందు మృతదేహాన్ని గుర్తించారు. స్థానికులు మున్సిపల్ కార్పొరేషన్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వెలికి తీశారు. కార్పొరేషన్ సిబ్బంది ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవం సమయంలో మృతి చెందిన పసికందును మృతదేహాన్ని డ్రైన్‌లో పడవేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈఘటన సప్తగిరి కాలనీ, ఐబీకాలనీ ప్రాంతాల్లో చర్చనీయాంశం అయ్యింది.



జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్లకు ఆర్థిక కష్టాలు

- మూడు నెలలుగా అందని వేతనాలు
- రాష్ట్రంలో 420 మంది ఇంటర్ ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్ల అవస్థలు

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు నెలలుగా కాంట్రాక్టు లెక్చరర్లకు వేతనాలు అందకపోవడం వల్ల కష్టాల పాలవుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న సుమారు 420 మంది ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్లు సకాలంలో వేతనాలు అందక విలవిలలాడుతున్నారు. చాలీచాలని జీతాలతో అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తున్న కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు ఏప్రిల్, మే, జూన్ నెలలకు చెందిన జీతాలు రాకపోవడంతో భార్యాపిల్లలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక శాఖ క్లియరెన్స్ రాకపోవడం వల్ల వేతనాలు అందడం లేదని వాపోతున్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఇంటర్ బోర్డు పరిధిలో దాదాపు మూడు వేల మంది కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేశారు. ఇంటర్ ఒకేషనల్ కోర్సు విభాగంలో పనిచేస్తున్న సుమారు 420 మంది కాంట్రాక్టు లెక్చరర్లు పోస్టులు మంజూరు కాకపోవడం, పలు ఇతర కారణాల వల్ల రెగ్యులర్ కాలేదు. ఒకవైపు ఉద్యోగాలు రెగ్యులర్ కాకపోవడం, మరోవైపు ఏప్రిల్ నెల నుంచి వేతనాలు అందక పోవడం వల్ల అర్ధాకలితో అలమటిస్తూ అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు అందించాలి



నలువాల శ్రీనివాస్, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల

రాష్ట్రంలో జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల పెండింగ్ వేతనాలు వెంటనే అందించాలి. మూడు నెలలుగా వేతనాలు అందకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. వేతనాలు ఏనెలకు ఆనెల సక్రమంగా అందించాలి. వేతనాలకు ఎప్పటికప్పుడు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది.

మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు



కాసం గంగా భవాని, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఆర్థిక శాఖ క్లియరెన్స్ లేకపోవడంతో వేతనాలు అందడం లేదంటున్నారు. చాలీ చాలనీ వేతనాలతో సంవత్సరాల తరబడి పనిచేస్తున్నాము. ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి.

కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి

- ఈ నెల 21న టెక్స్‌టైల్ పార్కు బంద్
- కార్మికుల సమావేశంలో నిర్ణయం



నిరసన తెలుపుతున్న కార్మికులు

తంగళ్లపల్లి, జులై 18 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కు కార్మికులకు నష్టం చేసే విధానాలను ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్‌పార్కు కార్మికుల సమావేశం యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సిఐటియు జిల్లాకార్యదర్శి రమణ మాట్లడుతూ 2023 సంవత్సరం బతుకమ్మ చీరల జ్లౌజ్ పీస్ వస్త్రానికి కార్మికులకు రావాల్సిన 10శాతం యారన్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో కార్మికులకు అందించిన మాదిరిగానే మీటర్‌కు 1.42 పైసలు అందించాలన్నారు. నేతన్న పొదుపు పథకం పూర్తయిన డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయడంలో నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపట్టారు. కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించక పోవడంతో జులై21న ఒకరోజు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమీక్ష జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సదానందం, వేణు, శ్రీకాంత్, అంజనేయులు, అంబదాస్, వెంకటేశ్, మహేశ్, ఆశోక్, రమేష్ శ్రీనివాస్, కనకయ్య, వరప్రసాద్, గంగారాం. లక్ష్మణ్, రవి, శంకర్, ప్రభాకర్, నరహరి, సత్యనారాయణ, సంపత్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

23న విద్యాసంస్థల బంద్

- విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. శుక్రవారం జిల్లాలోని తెలంగాణ చౌక్ వద్ద వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, పిడిఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుతాటి రాణా ప్రతాప్, పిడిఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అంగడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రాయికల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని ధర్మాజీపేట శివారులో శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన బెక్కం సాయిలు (70) తన పొలం నుంచి ఇంటికి వస్తుండగా శుక్రవారం రాత్రి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

బాలికపై మేనమామ అత్యాచారయత్నం

- తప్పించుకున్న బాలిక
- నిందితుడిపై పోక్సో కేసు

తిమ్మాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై మేనమామ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన సంపంగి ప్రేమ్ కుమార్(30) అనేవ్యక్తి తనసొంత మేనకోడలు అయిన బాలికను ఆమె ఇంటి నుంచి కరీంనగర్‌లోని కళాశాల వద్ద తన ద్విచక్ర వాహనంపై దింపుతానని చెప్పి బలవంతంగా వెంట తీసుకువెళ్లాడు. కానీ కళాశాల వద్ద బాలికను దించకుండా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ శివారులో ఉన్న కాకతీయ కాలువ వైపునకు తీసుకెళ్లాడు. పక్కనే ఉన్న చెట్లపొదల్లోకి బాలికను బలవంతంగా తీసుకువెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక అతడికి సహకరించకపోవడంతో బండరాయితో హత్యాయత్నానికి ప్రయత్నించాడు. ప్రతిఘటించిన బాలిక తప్పించుకొని తన తల్లిదండ్రులకు విషయం తెలియజేసింది. తల్లిదండ్రులు బాలికను తీసుకొని తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పారు. బాలికను భరోసాకేంద్రానికి తీసుకువెళ్లి మహిళా అధికారి సమక్షంలో స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు సీఐ తెలిపారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు ప్రేమ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు, పోలీసులు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, పట్టుకోవడానికి చర్యలు చేపట్టినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



దేవానందం(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో అనారోగ్యంతో ఈనెల 15న పురుగుల మందు తాగిన రైతు దేవానందం(62) మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయనకథనం మేరకు.. దేవానందం కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. వ్యవసాయపనులు చేసేందుకు ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్థాపం చెందిన దేవానందం పురుగుల మందు తాగాడు. మూడు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య రాజమణి, కొడుకు రాకేశ్‌లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ వివరించారు.

గుండెపోటుతో డీఎస్పీ మహేష్ మృతి

- కరీంనగర్ పోలీస్ శాఖలో విషాదం



హుజూరాబాద్‌లో భర్త మహేష్ మృతదేహంపై పడి రోదిస్తున్న ఏసీపీ మాధవి, ఇన్‌సెట్లో డీఎస్పీ మహేష్(ఫైల్)



డీఎస్పీ మహేష్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం/ హుజూరాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌శిక్షణా కేంద్రంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న మహేష్(56) గుండెపోటుతో శుక్రవారం కన్నుమూశారు. ప్రస్తుత హుజూరాబాద్ ఏసీపీ మాధవి భర్త అయిన మహేష్ మృతిపట్ల పోలీస్‌శాఖతీవ్రదిగ్ర్భాంతిని వ్యక్తం చేసింది. హుజూరాబాద్‌లో తన భార్య ఏసీపీ మాధవి వద్ద ఉన్న మహేష్ ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే ఆయన్ను హుజూరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈఘటనతో ఏసీపీ మాధవితో పాటు కుటుంబసభ్యులు, పోలీస్ ఉన్నతాధికారులు తీవ్రవిషాదంలో మునిగిపోయారు. ఎస్‌ఐగా వృత్తిని ప్రారంభించిన మహేష్, సతీమణి మాధవితోకలిసి ఒకేసారి సీఐగా, ఆపై డీఎస్పీగా పదోన్నతులు పొందారు. ఫ్రెండ్లీ పోలీస్ అధికారిగా ఆయనప్రజలమన్ననలు పొందారు.

- **డీఎస్పీ మహేష్ పార్థివదేహానికి సీపీ నివాళి..**

కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లో ఉన్న మహేష్ నివాసానికి చేరుకుని ఆయన పార్థివ దేహంపై పూలమాలవేసి సీపీ గౌస్‌ఆలం నివాళులర్పించారు. శోకసంద్రంలో ఉన్న ఏసీపీ మాధవికి, ఆమె కుమారులకు ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా మహేష్ ఆత్మకుశాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయనతోపాటు అడిషనల్ డీసీపీ(అడ్మిన్) వెంకటరమణ, కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీస్ ఉన్నతాధికారులు నివాళులర్పించారు.

పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం

కరీంనగర్ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో పట్టుబడిన, యజమానులు లేని (అన్‌క్లెయిమ్డ్), వదిలివేయబడిన (అబాండన్డ్) మొత్తం140 వివిధరకాల వాహనాలను బహిరంగ వేలంద్వారా విక్రయించనున్నట్లు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాలన్నీ ప్రస్తుతం కరీంనగర్ సీటీసీలో భద్రపరచినట్లు తెలిపారు. సిటీ పోలీస్ చట్టం-1348ఎఫ్, సెక్షన్40 ప్రకారం అందిన అధికారాలతో ఈ వాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ వాహనాలకు సంబంధించిన పూర్తి వివరాలను వేలం బృందం సభ్యులు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్ సెల్ నంబర్ 8712670758లో సంప్రదించి తెలు సుకోవచ్చన్నారు.

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అధికారిక ఫేస్‌బుక్ పేజీలో కూడా వివరాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వాహనాలపై ఏదేని అభ్యంతరం ఉన్నా, లేదా యాజమాన్య/హైపోథికేషన్ హక్కులు ఉన్నా, ఆసక్తిగల వ్యక్తులు ఆరు నెలలలోపు కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిర్ణీత గడువులోగా ఎటువంటి క్లెయిమ్‌లు రాకపోతే, వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు.

డీఎస్పీ మహేష్ మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసింది

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్

భగత్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏసీపీ మాధవి భర్త డీఎస్పీ మహేష్ మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్‌శాఖకు మహేష్ చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మహేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని వేడు కుంటున్నానని తెలిపారు. భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మాధవికి, ఆమె పిల్లలకు మనోధైర్యాన్ని కల్పించాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

ప్రతీ రోజు వంద కిలోమీటర్లు

- బడి మీద మక్కువతో ప్రయాణిస్తున్న విద్యార్థిని



పానేటి పద్మ

మానకొండూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బడి మీద మక్కువతో రోజూ వంద కిలోమీటర్లు ప్రయాణిస్తోంది ఓ విద్యార్థిని. వివరాలు ఇలా ఉన్నాయి. మానకొండూర్‌లోని బాలుర ఉన్నతపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పానేటి పద్మ గత సంవత్సరం వరకు మానకొండూర్‌లో ఉంటూ విద్య నభ్యసించింది. అయితే ఆమె తల్లి దండ్రులు వృత్తిరీత్యా సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటకు మకాం మార్చారు. మధ్యలో బడి మార్చలేని పరిస్థితి. అయితే ఇల్లంతకుంట నుంచి బస్సు సౌకర్యం లేదు. దీంతో తల్లి దండ్రులు ఆమెను వేములవాడలో ఉండే అమ్మమ్మ ఇంటిదగ్గర ఉంచారు. అక్కడి నుంచి ఆమె బస్సులో ప్రతిరోజు మానకొండూర్‌లోని బడికి వస్తోంది. ప్రతిరోజు రానుపోను వందకిలోమీటర్ల ప్రయాణం చేస్తూ పాఠశాలకు వస్తోందని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. అంతదూరం ప్రయాణం చేసినా ప్రతి రోజు అందరి కంటే ముందే పాఠశాలకు వస్తుందని ఆయన తెలిపారు.

ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఏడీ సమీక్ష

భగత్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బస్టాండ్ ఆవరణలోని సమావేశ మందిరంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ శుక్రవారం కరీంనగర్ జోన్ పరిధిలోని ఐదు రీజియన్ల ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో అన్ని రీజియన్ల పనితీరు, వర్షాకాలం ప్రారంభం అయినందున తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రీజియన్ల నుంచి వివిధ పర్యాటక ప్రదేశాలకు నడుపుతున్న టూర్ ప్యాకేజీ సర్వీసులకు ప్రయాణీల నుంచి లభిస్తున్న ఆదరణ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రీజనల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు, పి మల్లేశం, డి వియభాను, పి మహేశ్, వివిధ రీజియన్ల ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఏడీ సోలమన్

రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

కరీంనగర్ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటనలో ఒకరికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సెకండ్ అడిషనల్ జేఎంఎఫ్‌సీ కోర్టు తీర్పు వెలువరించింది. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ శివారులోని బైపాస్‌రోడ్‌లోని ఒక ఫంక్షన్‌హాల్ వద్ద 2016లో రోడ్డు దాటుతతున్న దెబ్బట కృష్ణమోహన్‌ను మినీవ్యాన్ ఢీకొట్టగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ కేసులో నిందితుడు మినీవ్యాన్ డ్రైవర్ సాధనవేని అలియాస్ తోట శంకరయ్యకు ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సెకండ్ అడిషనల్ జేఎంఎఫ్‌సీ కోర్టు తీర్పు వెలువరించిందన్నారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ ఆర్ పరమేశ్వర్‌ను సీఐ అభినందించారు.

యువకుడి హత్య ఘటనలో ముగ్గురిపై కేసు



కిషన్‌రావుపేటలో రోదిస్తున్న కుటుంబీకులు, బంధువులు

వెల్గటూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటకు చెందిన సల్లూరి మల్లేష్ (26) అనేయువకుడి హత్యకేసులో శుక్రవారం ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. మృతుడి తండ్రి సల్లూరి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నైనాల రాజిరెడ్డి(రాజన్న), నైనాల మల్లారెడ్డి (మల్లేష్), కొత్తపేటకు చెందిన చింతల హరీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. ఆయన కథనం ప్రకారం కిషన్‌రావుపేటకు చెందిన నైనాల రాజిరెడ్డి కూతురు విషయంలో గొడవ జరుగగా గతంలో సల్లూరి మల్లేష్‌పై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో మృతుడిపై ఆగ్రహంతో యువతితండ్రి నైనాల రాజిరెడ్డి, అతడి తమ్ముడు నైనాల మల్లారెడ్డి, కొత్తపేటకుచెందిన అతడి స్నేహితుడు చింతల హరీష్‌లు పథకం ప్రకారం గురువారం కోటిలింగాల రోడ్డు వైపు పాతవైన్స్ వెనక ప్రదేశంలో కత్తితో పొడిచి హత్య చేశారు.

- **భారీ బందోబస్తు మధ్య అంత్యక్రియలు**

మల్లేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం శుక్రవారం కిషన్‌రావుపేటకు తీసుకువచ్చారు. ఈక్రమంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులను మోహరించారు. పోలీసులు మృతుడి కుటుంబీకులకు నచ్చజెప్పి న్యాయం జరిగేలా చూస్తామని ఒప్పించడంతో ఎలాంటి గొడవలు లేకుండా మల్లేష్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

- **మిన్నంటిన రోదనలు**

కిషన్‌రావుపేటకుచెందిన సల్లూరి రాజయ్యకు నలుగురు కుమార్తెలు కాగామల్లేష్ ఒక్కడే కొడుకు. తమకు ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, పాల్గొన్న విద్యార్థులు

సుభాష్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థులకు దాదాపు రూ.8,000కోట్లకుపైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మేము అధికారంలోకి వస్తేమార్పు తీసుకువస్తాం, విద్యార్థులకు పెండింగ్ బకాయిలను విడుదల చేస్తామని చెప్పి ఇంతవరకు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల చదువు పూర్తై సర్టిఫికెట్లు కావాలని అడిగితే పూర్తి ఫీజుకడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు అంటున్నాయని ఆరోపించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అయితే బకాయిలు రాకపోవడంతో విద్యార్థులతో పాటు కళాశాలల నిర్వాహకులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. అలాగే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో మౌళిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, పర్యవేక్షించడానికి 16 మండలాల్లో ఒక్క మండలానికి కూడా ఎంఈవో లేని దుస్థితి నెలకొందన్నారు. రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలని డిమాండ్‌చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో అసెంబ్లీనిముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆసంపల్లి వినయ్‌సాగర్, ఎల్కటూరి ఇసాక్, సహాయకార్యదర్శులు దుర్గం భోగేశ్వర్, గట్టు ఆకాశ్, సందేశ్, రాకేశ్, అక్షయ్, సన్ని, నాయకులు లక్ష్మన్, చక్రి, మహేశ్, రఘు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ప్లాంట్‌లో యంత్ర సామగ్రి చోరీ

జ్యోతినగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ప్లాంట్‌లో ఎంజీఆర్‌లో ఉన్న విలువైన యంత్ర సామగ్రి చోరీకి గురైంది. చోరీ జరిగిందని ఎన్టీపీసీ ఏజీఎం విజయ్ కుమార్ సిక్దర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చురుగ్గా స్పందించారు. ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ నేతృత్వంలో పోలీసులు కొద్ది గంటల్లోనే శుక్రవారం సామగ్రిని పట్టుకున్నారు.

మేడిపల్లి సెంటరులోని ఒక దుకాణంలో దాచిన సుమారు 2.80 లక్షల రూపాయల విలువైన క్రషర్ హ్యామర్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నింది తులైన హర్యానాకు చెందిన వకీల్, మేడి పల్లి సెంటర్‌కు చెందిన అనిల్‌ను అదుపు లోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. అలాగే చోరీకి ఉపయోగించిన ట్రాక్టర్, ఎక్స్‌కావేటర్‌ను సీజ్‌చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

తంగళ్లపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ప్రణయ్ తన ఇంటిముందు రాత్రి నిలిపిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని దుండగలు ఎత్తుకెళ్లారు. అలాగే పద్మనగర్‌కు చెందిన గాజుల మహేశ్ ద్విచక్రవాహనం రాత్రి ఇంటి ముందు పార్కుచేయగా ఉదయం చూసే సరికి వాహనం కనిపించకుండా పోయింది. ఈ సంఘటనలపై ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రణయ్ ఇంటి ముం దు ఉన్న సీసీకెమెరాను పరిశీలించగా ముఖానికి మాస్క్ ధరించిన ముగ్గురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై చేరుకుని ప్రణయ్‌ఇంటి ముందు వాహనం ఎత్తుకెళ్తున్న దృశ్యం రికార్డు అయ్యింది. పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఈ నెల 25న ఖని నుంచి బీదర్‌కు ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, రేజింతల్, జర సంఘంకు సూపర్ లగ్జరీ సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్టు ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగ భూషణం ఒక ప్రకటనలో తెలిపారు. 25న గోదావరిఖని బస్టాండ్ నుంచి తెల్లవారు జామున 3.30గంటలకు బయలు దేరి 10గంటలకు బీదర్‌కు చేరుకుంటుంది. అక్కడ స్వయంభుగా వెలసిన లక్ష్మీనర్సింహ స్వామిని ఆలయ దర్శనం అనంతరం 2 గంటలకు బీదర్ బుర్జా చేరుకుంటుంది.



అనంతరం రేజింతల్‌లో సిద్ధి వినాయక స్వామి దర్శనం అనంతరం సాయంత్రం 4 గంటలకు జరా సంఘంలోని శ్రీ కేతికి సంగమేశ్వర స్వామిని దర్శించుకుని రాత్రి 12 గంటలకు తిరిగి గోదావరిఖనికి చేరుకుంటుందన్నారు. గోదావరిఖని నుంచి పెద్దలకు రూ.1470, పెద్దపల్లి నుంచి రూ.1420, కరీంనగర్ నుంచి రూ.1370, పిల్లలకు గోదావరిఖని నుంచి రూ.1130, పెద్దపల్లి నుంచి రూ.1070, కరీంనగర్ నుంచి రూ.1030 చార్జీలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంత ప్రజలు వినియోగించు కోవాలని కోరారు. వివరాల కోసం 7013504982, 7989847927 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బీపాస్ స్థానంలో బిల్డ్ నౌ



- ఏఐ టెక్నాలజీతో భవన నిర్మాణాలకు అనుమతి
- ఇకపై అనుమతి తర్వాతే ఇంటి నిర్మాణం
- ఆగస్టు నుంచి అమల్లోకి

చొప్పదండి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీజీబీపాస్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా బిల్డ్ నౌ ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. నాణ్యమైన, వేగవంతమైన పౌర సేవలను అందించడమే లక్ష్యంగా మున్సిపాలిటీలలో భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతి ప్రక్రియను ఇకపై బిల్డ్ నౌ ద్వారానే పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీపాస్, బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి బిల్డ్ నౌ ద్వారానే అనుమతులు పొందాల్సి ఉంటుంది.

బీపాస్‌ను ఈ నెలాఖరుకు ముగిస్తున్నట్లు తెలిసింది. బిల్డ్ నౌ పూర్తిగా ఏఐ టెక్నాలజీ ఆధారిత వ్యవస్థతో పోర్టల్‌ను రూపొందించగా నిర్మాణ అనుమతి ప్రక్రియ వేగంగా పూర్తమవుతుంది. 75 గజాలలోపు నిర్మాణానికి అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసిన వెంటనే అనుమతి పొందవచ్చునని అధికారులు చెప్తున్నారు. ఆపై విస్తీర్ణం ఉన్న స్థలాలకు, లే అవుట్లకు 15 నుంచి 21 రోజులలోపు అనుమతి లభించనుంది.

ఏఐ టెక్నాలజీతో అనుమతి

నూతనంగా ప్రవేశెట్టిన బిల్డ్ నౌ పోర్టల్ ఏఐ టెక్నాలజీతో పనిచేస్తుంది. అనుమతి కోసం దరఖాస్తు చేసిన వెంటనే సంబంధిత అధికారికి స్థలం లొకేషన్ తెలిసిపోతుంది. స్థలంలో ఎలాంటి నిర్మాణాలు ఉన్నాయో సులువుగా తెలుస్తుంది. నిమిషాల్లోపలే స్థలం పరిశీలన పూర్తవుతుంది.

గతంలో డిజైన్లు, పత్రాలు, మ్యాప్‌ల పరిశీలనకు 20 నుంచి 30 రోజుల సమ యం పట్టేది. ఇప్పుడు సూచించిన విధానంలో పత్రా లను సమర్పిస్తే

అనుమతి తీసుకున్న తర్వాతే పనులు

బిల్డ్ నౌ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న నిర్మాణదారులు అనుమతి తీసుకున్న తర్వాతే భవన నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. బీపాస్ విధానంలో ఇంటి నిర్మాణం చేపట్టిన తర్వాత కూడా అనుమతి లభించేది. ప్రస్తుతం బిల్డ్ నౌలో మాత్రం అనుమతి తీసుకున్న తర్వాత ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుడి ఇంటి స్థలంలో ఎలాంటి కట్టడాలు ఉన్నా సంబంధిత అధికారికి ఏఐ టెక్నాలజీ ద్వారా స్థల స్వభావం తెలిసి పోతుంది. దీంతో అధికారి భవన నిర్మాణ అనుమతి నిరాకరించే అవకాశం ఉంటుంది. 2020లో తీసుకువచ్చిన టీఎస్ బీపాస్ ఈ నెల 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనుంది. టీఎస్ బీపాస్ స్థానంలో ఆగస్టు 1 నుంచి పూర్తిస్థాయిలో బిల్డ్ నౌను వినియోగంలోకి తీసుకురానున్నారు. వేగవంతమైన పౌర సేవలందించడమే లక్ష్యంగా చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ఒకే రాష్ట్రం ఒకే విధానం పేరిట బిల్డ్ నౌకు శ్రీకారం చుట్టింది.



నిమిషాల్లోనే పరిశీలన పూర్తవు తుంది. అనుమతులు లేకుండా డిజైన్‌కు భిన్నంగా భవన నిర్మాణాలు చేపట్టడం, వ్యాపార అవసరాల కోసం నిర్మించే భవనాలను నివాస గృహాలుగా చూప డం వంటి వాటికి బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. లే అవుట్ నిర్మాణ స్థలం హద్దుల అతిక్రమణకు అవకాశం ఉండదు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం మే/జూన్-2025లో నిర్వహించిన డిగ్రీ-2,4,6వ(సీబీసీఎస్)సెమిస్టర్స్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీఏఎల్) సంబంధించిన పరీక్ష ఫలితాలను ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ శుక్రవారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు తమ ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in మరియు https://stvuresults. a(ure-websites.netలో చూసుకోవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్ కుమార్, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ అబ్రరుల్ బాకి, అసిస్టెంట్ రిజిస్టర్ వై. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ కళాశాలను సందర్శించిన శాతవాహన వైస్ చాన్స్‌లర్

రామగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శాతవాహన వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్ శుక్రవారం మంథని జేఎన్‌టీయూ ఇంజినీ రింగ్ కళాశాలను సందర్శించారు. శాతవాహన యూనివర్శిటీకి అను బంధంగా హుస్నాబాద్‌లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ కళాశాల ఆరంభం అవుతున్న నేపథ్యంలో మంథని ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న వసతులను పరిశీలించారు. కళాశాలలోని అకాడమీ బ్లాక్‌తో పాటు ల్యాబ్‌లు, లైబ్రరీ, తరగతి గదులను, హాస్టల్‌ను పరిశీలించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌తో సమావేశమై సిలబస్, అడ్మిషన్ల ప్రక్రియపై చర్చించారు. రిజిస్ట్రార్ రవికుమార్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ సురేష్, ప్రొఫెసర్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఉన్నారు.

క్రీడల జిల్లాగా ఖ్యాతి సాధించాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్



హరీష్‌ను సన్మానిస్తున్న డీవైఎస్‌వో, క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా క్రీడల జిల్లాగా ఖ్యాతిని సాధించాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ అన్నారు. జిల్లాలోని కోనరావుపేట మండలం నాగారంనకు చెందిన బుర్రవేణి హరీష్ నేషనల్ ఇన్‌స్ట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఐఎస్)లో ఆర్చరీ విభాగంలో సీటు సాధించగా శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో హరీష్‌ను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాలీబాల అకాడమీ కోచ్ గుర్రం సంపత్‌గౌడ్, ఎం జగన్మోహన్, కబడ్డీ కోచ్ ప్రశాంత్, వాలీబాల్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

డీపీవో కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

భగత్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో నమోదు లేని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేయాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు శుక్రవారం కరీంనగర్‌లో డీపీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎలుకపెల్లి సారయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వడ్లూరి లక్ష్మీనారాయణ, కార్మికులు పర్లపల్లి రమేష్, కండె మధునయ్య, లక్ష్మీ, సరోజన, అవినాష్, నితిన్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా జూడో సెంటర్ పరిశీలన



క్రీడా పాఠశాల ఖేలో ఇండియా జూడో సెంటర్ విద్యార్థులతో సాయ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలోని ఖేలో ఇండియా జూడో సెంటర్‌ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్)డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ జిమ్నాస్టిక్ కోచ్ చంద్రశేఖర్‌రావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియాలోని వివిధ విభాగాలను పరిశీలించారు. విద్యార్థుల గురించి, వారి ఖర్చుల గూర్చి, కోచ్ జీతభత్యాల గురించి అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేసిన వారు ఖేలో ఇండియా జూడో సెంటర్ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్, ఖేలో ఇండియా కోచ్ కే శ్యామ్, ప్రాంతీయ క్రీడాపాఠశాల కోచ్‌లు ఇందిర, విక్రమ్, సాయి, కిష్టయ్య, పవన్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలి

మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీ వినోద్ కుమార్, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను వెంటనే ఆన్‌చేసి నీటిని ఎత్తిపోయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందన్న అక్కసుతో కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయకుండా లక్షలాది మంది రైతుల ఉసురు పోసుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. దీనిపై సర్కారు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువమానేరు జలాశయాలు, చెరువులు వెలవెలబోతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టుల నుంచి త్వరలోనే మంచి నీరు సరఫరా చేయలేని దుస్థితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కానీ మేడిగడ్డ బరాజ్ వద్ద 82 వేల పైచిలుకు క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించి సముద్రం పాలవుతుందన్నారు. మేడిగడ్డ బరాజ్‌తో ఎటువంటి సంబంధం లేకుండా కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయడానికి అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మేడిగడ్డ బరాజ్‌తో సంబంధం లేకుండానే కన్నెపల్లి పంపుహౌస్ నుంచి రోజుకు 20 వేలపై చిలుకు క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసు కునే అవకాశం ఉందన్నారు.

కన్నెపల్లి పంపుహౌస్ నుంచి అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకు ఎత్తిపోయడానికి నేషనల్ డ్యాం సెఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఎక్కడ అభ్యంతరం తెలుపలేదని గుర్తుచేశారు. ఎస్సారెస్పీ పునర్జీవం ద్వారా వరదకాలువను నిండుగా నింపుకోవడంతో పాటుగా ఈ పరిధిలోని అన్ని చెరువులను నింపడానికి పుష్కలమైన అవకాశాలున్నాయని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పదే పదే చెపుతున్న రేవంత్ సర్కారు మాత్రం కక్ష పూరితంగానే వ్యవహరిస్తోందన్నారు. కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోస్తే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుం దన్న అక్కసుతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నీటిని ఎత్తిపోయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిని ఎత్తిపోసే విషయంలో కాంగ్రెస్ సర్కారు ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చూపుతున్న వివక్ష, నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది రైతుల జీవితాలు ఆగమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు.

ప్రస్తుతం నార్లు ముదిరి పోతున్నాయని, ఈ సమయంలో నాట్లు వేసుకోవడానికి ఒక్కసారి సాగునీరు అందిస్తే రైతులకు అండగా నిలిచినట్లు అవుతుందన్నారు. మేడిగడ్డ బరాజ్‌ను యాజమాన్యమే రిపేర్ చేసుకోవాలని ఎన్‌డీఎస్ఏ ఇప్పటికే స్పష్టంగా చెప్పిందన్నారు. ఇప్పటికైనా కక్షలు మానుకొని రైతు సంక్షేమం కోసం కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి నార్లు వేసుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని విజప్తిచేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, సిరిసిల్ల జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ రమణారావు, రాజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి సారె..



పట్టువస్త్రాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

వేములవాడ కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరి అమ్మవారికి శ్రీవల్లి సేవా సంస్థకు చెందిన సుమారు 200 మంది సభ్యులు శుక్రవారం కన్నుల పండువగా సారె సమర్పించారు. తిప్పాపూర్ బస్టాండు నుంచి అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు, కుకుమ, పూలు, పండ్లు, స్వీట్లతో ఊరేగింపుగా రాజన్న ఆలయానికి తరలి వచ్చారు. ముందుగా శ్రీలక్ష్మీ గణపతికి రాజరాజేశ్వర స్వామి వారికి పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలను అందజేశారు. అనంతరం రాజరాజేశ్వరి అమ్మ వారికి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకు మ, పూలు, పండ్లు, స్వీట్లను అంద జేశారు. పాడి పంటలు, పిల్లపాపలు చల్లంగా ఉండేలా దీవించాలని అమ్మ వారిని వేడుకున్నట్లు సంస్థ ఫౌండర్ మల్లెబోయిన పుష్పలత తెలిపారు.



అమ్మవారికి సమర్పించిన పట్టువస్త్రాలు, పూలు, పండ్లు

స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కిని నరసింహులు



సమావేశంలో మాట్లాడుతున్న బక్కిని నరసింహులు

కరీంనగర్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కిని నరసింహులు, జాతీయ అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడు, కరీంనగర్ పార్లమెంట్ పరిశీలకులు నన్నూరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కమిటీలు పూర్తిచేసి గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని అన్నారు. గ్రామాల్లో టీడీపీకి మంచి ఆదరణ ఉందన్నారు. పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థులు వ్యక్తిగత ఓటు బ్యాంకు కలిగి ఉంటే ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యకర్తలు సమన్వయంతో కలిసి పనిచేయాలని, పార్టీ శ్రేణులు ఎన్నికల్లో కసితో పనిచేసి టీడీపీ సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గొల్లపల్లి ఆనంద్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్ గౌడ్, పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ సభ్యులు కళ్యాడపు ఆగయ్య, దామెర సత్యం, ఆవునూరు దయాకర్‌రావు, బత్తుల శ్రీనివాస్, మచ్చ ఆంజనేయులు, నాగుల బాలాగౌడ్, తీగుట్ల రమేష్ కుమార్, రొడ్డ శ్రీనివాస్, రొడ్డ శ్రీధర్, లంక భాస్కరశర్మ, తాటికొండ శంకర్, ఆకుల కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య భవనాల కూల్చివేతలు





వేములవాడలో భవనాల కూల్చివేత వద్ద మోహరించిన పోలీసులు

వేములవాడ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండు నుంచి రాజన్న ఆలయం వరకు చేపడు తున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా భవనాల కూల్చివేతలు కొన సాగుతున్నాయి. మొత్తం 243 భవనాలు తొలగించేందుకు నిర్వాసితులను గుర్తించారు. అయితే 88 మంది హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకువచ్చారు. మిగతా ఇళ్లను గతనెల 16వ తేదీన పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. 88 మందికి కోర్టు స్టే ముగియడంతో శుక్రవారం ఆయా భవనాల కూల్చివేత ప్రారంభించారు. మరో 6 మంది నిర్వాసితుల స్టే గడువు సైతం ఈనెల 23వ వరకు ఉందని స్థానిక నిర్వాసితులు తెలిపారు. రాజన్న ఆలయం ముందు శుక్రవారం భారీగా పోలీసులు, అధికారులు చేరుకున్నారు.

కూల్చివేతలను పరిశీలించిన కలెక్టర్..

వేములవాడ పట్టణంలోని చేపడుతున్న కూల్చివేతలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం పరిశీలించారు. రాజన్న ఆలయం ముందు భాగంలో పనులు కొనసాగుతుండగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వెంట ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ ఉన్నారు.

దివ్యాంగులకు రాయితీ రుణాలు



దరఖాస్తుకు ఈనెల 31 వరకు గడువు

కరీంనగర్ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఇతరుల మాదిరిగానే దివ్యాంగులు సాధారణ జీవనం గడపడమే ప్రధాన లక్ష్యంగా వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు, వ్యాపారం వంటివి చేసుకునేలా దివ్యాంగుల ఉపాధి, ఉనరావాస పథకం అమల్లోకి తీసుకు వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే దరఖాస్తుల స్వీరణ ఆన్‌లైన్ విధానంలో ప్రారంభించారు. లబ్ధిదారులు ఈ నెల 31 తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నది. tgomms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. కరీంనగర్ రూరల్ మండలంలో ఇప్పటికే ఇరుకుల్ల గ్రామానికి చెందిన దివ్యాంగునికి 50వేల రుణం బ్యాంక్ లింకేజీ ద్వారా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ధ్రువపతారలతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు గ్రామీణ ప్రాంతం వారికి ఎంపీడీవో, పట్టణవాసులకు మున్సిపల్ కమిషనర్ లాగిన్‌లోకి వెళ్తాయి. వాటిని మండల స్థాయిలో ఎంపీడీవో, సీడీపీఓ, ఏపీఎంతో ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తారు. ఇందులో మహిళలకు 33 శాతం అవకాశం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

అర్హులు ఎవరంటే..

కనీస దివ్యాంగత్వం 40శాతం పైన ఉండాలి. సదరం సర్టిఫికెట్ కలిగి ఉండాలి. వయస్సు 21-55 సంవత్సరాలలోపు ఉండాలి. ఆదాయ పరిమితి 1లక్ష 50వేలు (గ్రామీణ ప్రాంతాల వారికి) ఉండాలి. అయిదేళ్లలో దివ్యాంగుల సంక్షేమ శాఖ, ఇతర శాఖ, ఏదైనా ప్రభుత్వ సంస్థ నుంచి రాయితీ పొంది ఉండకూడదు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నం ప్రకాష్

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీసీలను, హిందూవులను అనాధి కాలం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తూనే ఉందని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ అన్నారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతున్నామని చెప్తూనే బీసీ-ఈ కేటగిరిలో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడం సరికాదన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు పక్కకు పెట్టి జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకలు పెంట శ్రీనివాస్, శానకొండ వాసు, మంతెన కిరణ్, మాదాసు సంజీవ్, నారోజు రాకేష్ చారి, మంద వెంకన్న, గుడిసెల రమేష్ గౌడ్, అజయ్, గుంపట మురళి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్/గన్నేరువరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్, గన్నేరువరంలలో శుక్రవారం నూతనరేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఆయన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేశారు. అనంతరం మాట్లాడారు. మానకొండూర్ మండలానికి మొత్తం 2043 రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. గన్నేరువరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 442మంది లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజే శారు. ఆయాకార్యక్రమాల్లో ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ ఓదెలు, ఆత్మ చైర్మన్ ద్యావ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి సంపత్, జిల్లాపౌరసరఫరాల అధికారి నర్సింగరావు, ఏఎస్‌వో బుచ్చిబాబు, తహసీల్దారు నరేందర్, ఆర్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.



మానకొండూర్‌లో రేషన్‌కార్డు లబ్ధిదారులతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

తిమ్మాపూర్: ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి, తిప్పాపూర్, జవారిపేట గ్రామాల బీఆర్ఎస్‌పార్టీకి చెందిన మాజీసర్పంచ్‌లు, నాయకులు భారీగా ఎల్ఎండీ కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి సముచిత ప్రాధాన్యం లభిస్తుందని భరోసా ఇచ్చారు.

కుంగిన లోలెవల్ బ్రిడ్జి

- ప్రమాదకరంగా ప్రయాణం
- భారీ వాహనాలు వెళితే అంతే..

శంకరపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామం నుంచి మెట్‌పల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. భారీ గుంతలు ఏర్పడి బ్రిడ్జి కొంతభాగం కిందికి కుంగింది. ఈ దారి మెట్‌పల్లి, లింగాపూర్, ఆముదాలపల్లి మీదుగా వీణవంకకు వెళ్లడానికి అత్యంత అనువుగా ఉంటుంది. దీంతో ఈ మార్గం గుండా వాహనాల రాకపోకలు ఎక్కువగా జరుగుతాయి. లోలెవెల్ బ్రిడ్జి వద్ద మూలమలుపు ఉండడంతో గుంతను గుర్తించకుండా వాహనదారులు వెళ్లడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు మరింత ఇబ్బందికరంగా ఉంటుందని, వాహనం నిలకపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన లింగాపూర్-మెట్‌పల్లి లోలెవల్ బ్రిడ్జి

● సంక్షిప్తంగా..

చొప్పదండి: ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమపథకాలు అందుతున్నాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పల్లెపల్లెకు కాంగ్రెస్ జెండా కార్యక్రమాన్ని పెద్దకుర్మపల్లె, రేవెల్లిలో నిర్వహించారు.

ఇల్లందకుంట: మండలంలోని రాచపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం పల్లె రామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు.

- ఇల్లందకుంట మండలంలోని కనగర్తిలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు.

భగత్‌నగర్: రేకుర్తిలోని కంటి ఆసుపత్రిలో 40 మంది పేదలకు ఉచితంగా కాటరాక్ట్ చికిత్సలు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ చిదుర సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలోని సెయింట్‌మేరీ పాఠశాల విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

కరీంనగర్ క్రైం: డీఎస్పీ మహేష్ గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు.

కరీంనగర్ రూరల్: మండలంలోని నగునూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

- కరీంనగర్ రూరల్ మండలం ఫకీర్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: సినీ గేయ రచయిత జి రమేశ్ దర్శకత్వంలో రాబోతున్న 'ఉమ్మడి కరీంనగర్ జిల్లా వైభవ గీతం'పై నిర్మిస్తున్న షూటింగ్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రారంభించారు.

ఎస్సారార్ కళాశాల పరిశోధన కేంద్రం కోసం దరఖాస్తు

గణేశ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్సారార్ అటానమస్ కళాశాలను పరిశోధన కేంద్రంగా గుర్తించాలని కోరుతూ పరిశోధన కమిటీ బృందంతో కలిసి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ దరఖాస్తు రిపోర్టును శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సారార్ కళాశాల పరిశోధన కేంద్రంగా గుర్తించడానికి అవసరమైన అన్ని అర్హతలను కలిగి ఉందన్నారు. కళాశాల తెలుగు, కామర్స్ జంతు, వృక్ష శాస్త్ర విభాగాలను పరిశోధన కేంద్రాలుగా గుర్తించి అర్హత గల అధ్యాపకులను పరిశోధన పర్యవేక్షకులుగా నియమించాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల పరిశోధన కమిటీ సమన్వయకర్త డాక్టర్ ఎం మల్లారెడ్డి మాట్లాడుతూ కళాశాలకు సంబంధించిన ఐదు సంవత్సరాల అకాడమిక్, పరిశోధనప్రగతిని, నాలుగు విభాగాలకు చెందిన అర్హత గల అధ్యాపకుల యొక్క పరిశోధన పత్రాలను, వారి రచించిన పుస్తకాల వివరాలను, బోధన, పరిశోధన అనుభవాన్ని యూనివర్సిటీకి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నితిన్ పాఠక్, టి రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి, పరిశోధన కమిటీ సమన్వయకర్త డాక్టర్ ఎం మల్లారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ హర్జీత్ కౌర్, డాక్టర్ వంగల శ్రీనివాస్, డాక్టర్ టి శ్రీనివాస్, డాక్టర్ బి సతీష్ కుమార్, డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, డాక్టర్ ఆర్ స్వరూపరాణి, డాక్టర్ కే రాజేష్, డాక్టర్ రాజేశం, డాక్టర్ బూర్ల నరేష్, డాక్టర్ పడాల తిరుపతి పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో బోనాల ఉత్సవాలు

రామడుగు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాలతో పోతరాజుల వేషధారణలతో ఊరేగింపుగా తరలివెళ్లి పోచమ్మకు మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు తిరునగిరి పద్మ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నరసింహారెడ్డి, వనిత, ఉమాదేవి, అపర్ణలత, శ్రీలత, వెంకటలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



దేశరాజుపల్లిలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

చొప్పదండి: చొప్పదండిలోని సిద్ధార్థ స్కూల్‌లో బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనాలతో ఊరేగింపు నిర్వహించగా వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. స్కూల్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలకేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నెత్తినబోనాలతో సంబరాలు నిర్వహించారు.

సాధనా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో..

కరీంనగర్ కల్చరల్: నగరంలోని జ్యోతినగర్ సాధనా స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు పూజలు జరిపి వేడుకను ప్రారంభించారు. కార్యక్రమంలో హైస్కూల్, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్స్ వి కుమారస్వామి, ఆర్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సెయింట్‌జార్జ్‌లో

భగత్‌నగర్: నగరంలోని సెయింట్ జార్జ్ పాఠశాలలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి, ప్రిన్సిపాల్స్ ప్రియదర్శిని, భార్గవ్, కో-ఆర్డినేటర్ వనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్టూనిస్ట్ భూపతికి జాతీయ స్థాయి బహుమతి

కరీంనగర్ కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జాతీయ కార్టూనిస్ట్ పత్రిక 'కార్టూన్ వాచ్' వారు ఢిల్లీలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన జాతీయ స్థాయి కార్టూన్ పోటీలో నగరానికి చెందిన కార్టూనిస్ట్ టి భూపతి పాల్గొనగా ద్వితీయ బహుమతి సాధించారు. పోటీల ఫలితాలు గురువారం రాత్రి విడుదలయ్యాయి. ఆయనకు ప్రశంసాపత్రం, నగదును నిర్వాహకులు ఆన్‌లైన్‌లో పంపించారు. ఈ సందర్భంగా భూపతికి తెలంగాణ కార్టూన్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాకీర్, రాజమౌళి, తదితరులు అభినందనలు తెలిపారు.

'అల్ఫోర్స్'లో షుగర్ బోర్డ్స్ ఏర్పాటు

కొత్తపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో సీబీఎస్ఈ నియమావళి ప్రకారం ఏర్పాటు చేసిన షుగర్ బోర్డును శుక్రవారం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచన మేరకు సీబీఎస్ఈ దేశవ్యాప్తంగా షుగర్ బోర్డులను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. ఈ బోర్డుల ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన అలవాట్లను తెలుసుకోవచ్చని, వారు తీసుకునే ఆహారాలలో కూడ మార్పు తీసుకురావడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నాటికలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

గన్నేరువరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు సైబర్‌నేరాలు, షీ టీమ్‌సేవలపై అవగాహన కలిగి ఉండాలని టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ మామిడాల సురేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫోన్‌లో గుర్తుతెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని, వారికి ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. బాలికలపై ఎవరైనా వేధింపులకు గురిచేస్తే షీ టీమ్‌ను సంప్రదించాలని కోరారు. సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

సైదాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాష్ట్ర రవాణాశాఖ, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నంప్రభాకర్ పర్యటిస్తారని తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎల్ఎస్‌సీఎస్ పంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు, నూతన రేషన్‌కార్డులు, స్టీల్ బ్యాంకు సామగ్రి, కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వెన్కేపల్లిలో వన మహోత్సవంలో పాల్గొని, అక్కడి నుంచి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇందిరమ్మ మోడల్ ఇల్లును, నల్లరామయ్యపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనం, అమ్మనగుర్తిలో కొత్తగా నిర్మించిన సబ్‌స్టేషన్ ప్రారంభించనున్నట్లు మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ప్రధాని, ముఖ్యమంత్రి ఫొటోలపై నిర్లక్ష్యం

- తిమ్మాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో మూలనపెట్టిన సిబ్బంది





టేబుల్ వెనకాల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో, ఓ టెబుల్‌పై తలకిందులుగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఫొటో

తిమ్మాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఫొటోలను పక్కన పెట్టారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఫొటోలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. కానీ తిమ్మాపూర్ మండల కార్యాలయంలోని ఎంపీపీ గదిలో ఓ టేబుల్ సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టారు. దానిపై ఇష్టానుసారంగా కవర్లు ఇతర వస్తువులు పెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను అదే గదిలో టేబుల్ సందులో నేలపై ఉంచారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీవో, ఎంపీవో సురేందర్‌ను వివరణ కోరగా తాను మూడు రోజుల క్రితం ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్నానని, పరిశీలించి ప్రధాని, సీఎం ఫొటోలను తగిన విధంగా ఏర్పాటు చేస్తామన్నారు.

010 పద్దు కింద వేతనాలు చెల్లించాలి

తిమ్మాపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆదర్శపాఠశాలల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో తపస్ సభ్యత్వనమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శపాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010పద్దు కింద వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వాలు ఏన్నో ఏళ్లుగా హామీ ఇస్తున్నా.. ఇప్పటికీ ఉత్తర్వులు జారీచేయకుండా కాలయాపన చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జి సత్యం, కార్యదర్శి ఎం మహేశ్వర్, తిమ్మాపూర్ మండల శాఖ అధ్యక్షుడు ఎం కరుణాకర్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్జీటీ సభ్యత్వ నమోదు

వీణవంక, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్జీటీ యూనియన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కర్వేద మైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటుహక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజేందర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి గోన సత్యం, రాష్ట్ర కార్యదర్శి అంజనేయులు తదితరులున్నారు.

కొత్తగట్టులో పీఆర్టీయూ ఆధ్వర్యంలో..

శంకరపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పీఆర్టీయూ 2025 సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రమోషన్స్, పెండింగ్ బిల్లులు ఇప్పించడానికి పీఆర్టీయూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేముల లక్ష్మీనారాయణ, మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

గంగాధర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాడేకర్ అన్నారు. శుక్రవారం గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, అంగన్‌వాడీకేంద్రం, భవితకేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వపాఠశాలల్లో మెరుగైన విద్యను అందించాలని, అన్నిరంగాల్లో విద్యార్థులు అవగాహన కలిగి ఉండేలా వినూత్నరీతిలో బోధించాలన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులతో ఇంగ్లీష్, హిందీ, తెలుగు పుస్తకాలను చదివించారు. మల్లాపూర్‌లో నిర్వహించిన గ్రామసభకు హాజరైన ఆమె మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వపథకాల గురించి తెలుసుకోవాలన్నారు. శుక్రవారం గ్రామసభల్లో మహిళలకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాసన, గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, ఎంపీవో గౌరి రమేష్, ఎంఈవో ప్రభాకర్‌రావు, సీడీపీవో నర్సింగరాణి, అధికారులు పాల్గొన్నారు.

బాబోయ్ కోతులు..

(5వ పేజీ తరువాయి)

చేయిండంపై స్థానిక సంస్థలు అనాసక్తి చూపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలు తమ ప్రాంతాల్లో సంచరిస్తున్న కోతులను పట్టుకోవడానికి ఆసక్తి చూపకపోతుం డటం పట్ల ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోతులను పట్టు కునేందుకు ప్రత్యేక సిబ్బంది అవసరం. అలాగే ప్రత్యేక వాహనంతో పాటు ఖర్చు కూడా అధికమవు తున్న కారణంగా గ్రామపంచాయతీలు, మున్సి పాలిటీలు కోతులను పట్టుకునేందుకు ముందు కు రావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఆయా స్థానిక సంస్థలు లేదా స్థానిక ప్రజలు డబ్బులు జమ చేసుకుని కోతులను బంధించి అటవీ ప్రాంతాల్లో వదిలిపెట్టేవిధంగా కొన్ని సంస్థలతో ఒప్పందం చేసుకుటున్నప్పటికీ వారు పట్టుకున్న తరువాత కొద్ది రోజులకు మళ్లీ గుంపులు గుంపులుగా కోతులు గ్రామాలకు చేరుతన్నాయి.

మోడల్ స్కూల్‌లో పరిచయ శిబిరం

చొప్పదండి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్‌లో వాయిస్-4 సంస్థ ఆధ్వర్యంలో పరిచయ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: మండలంలోని బొమ్మకల్‌లోని టీఎంఆర్ఎస్‌జేసీ బాయ్స్ 1 (గురుకుల) పాఠశాలలో వాయిస్ 4 టీం ఆధ్వర్యంలో బాలురకు శిక్షణశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీర్ల మహేష్, డిప్యూటీ వార్డెన్ సైఫుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ నియోజకవర్గంలో వర్గాలు లేవు

- బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి

ఇల్లందకుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నియోజకవర్గంలో వర్గాలు లేవని, పాత,కొత్త అందరూ సమానమేనని బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీలో కొత్త, పాత తేడా లేకుండా అందరినీ సమానంగా చూస్తూ 2021లో పార్టీలో చేరిన మాడ గౌతమ్‌రెడ్డికి హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ బాధ్యతలు అప్పగించిందన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలు, 2024 పార్లమెంట్ ఎన్నికలు ఆయన అధ్యక్షతన జరిపించినప్పటికి పార్టీలో గుర్తింపు లేదని కార్యకర్తలను తప్పుదారిలో తీసుకెళ్తున్నారన్నారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్త శ్రీనివాస్, అబ్బిడి తిరుపతిరెడ్డి, మురహరి గోపాల్, తాళ్ల పాపిరె డ్డి, ఉప్పు దుర్గయ్య, ఇంగిలే రమేష్, కొక్కుల దేవేందర్, గురుకుంట్ల సంజీవ్, సమ్మయ్య, మురళీ, అయిలయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

హుజూరాబాద్‌రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ గ్రామంలో మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన అగ్రికల్చర్ సైన్స్ విద్యార్థులు ఫీల్డ్‌వర్క్‌లో భాగంగా జమ్మికుంట కేవీకే ఆధ్వర్యంలో శిక్షణ పొంది శుక్రవారం గ్రామంలోని రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. నిమాస్త్ర, బీజామృతం తయారు చేసుకునే విధానం గురించి వివరించారు. వాటి ఉపయోగాలు, దీని ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. అనంతరం ఎగుమతి, దిగుమతి చేసుకునే విధానం, లాభనష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు స్వామిరెడ్డి, శ్రీనివాస్, రమేష్, కిరణ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.


లక్ష్మీపూర్‌లో రైతులకు అవగాహన

రామడుగు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఎన్ఎంఎన్ఎఫ్ పథకంలో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏడీఏ ప్రియదర్శిని హాజరై రైతులకు సేంద్రియ సాగుపై సలహాలు, సూచనలు చేశారు.

ఆయిల్‌పామ్ సాగులో మెలకువలు, పంటసాగుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాల గురించి హార్టికల్చర్ ఆఫీసర్ రోహిత్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి త్రివేదిక, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

జమ్మికుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్‌లో జమ్మికుంట, వీణవంక మండలాలకు చెందిన 26మంది లబ్ధిదారులకు 23 లక్షల రూపాయల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు వెంటనే బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేశినికోటి, సుంకరి రమేష్, గూడెపు సారంగపాణి, పూదరి రేణుక-శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంటలో లబ్ధిదారులతో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు

● మృతుల కుటుంబాలకు పరామర్శ

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కర్ణకంటి కమలమ్మ, చింతల భాగ్యమ్మ ఇటీవల మృతిచెం దగా వారి కుటుంబాలను హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ శుక్రవారం పరామర్శించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

భగత్‌నగర్: కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్ గ్రామానికి చెందిన కట్ల రమ, భూష సంపత్‌లకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంజాల స్వామిగౌడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ అనేది పేదలకు వరమని, ఇందుకు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం రేవంత్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భూష సంపత్, భూస రాజయ్య, మంద రవి, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

జమ్మికుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం జమ్మికుంటలో హుజూరాబాద్ నియోజకవర్గస్థాయి ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పార్టీ భవిష్యత్తు కోసం నిరంతరం కృషిచేసే కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎరబెల్లి సంపత్‌రావు, నర్సింహరాజు, బింగి కరుణాకర్, శీలం శ్రీనివాస్, తుమ్మ శోభన్‌బాబు, ఆకుల రాజేందర్, సమ్మిరెడ్డి, జీడీ మల్లేష్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లను సందర్శించిన అడిషనల్ డీసీపీ

సైదాపూర్/శంకరపట్నం/మానకొండూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్, శంకరపట్నం, మానకొండూర్ మండలం కేశవపట్నం పోలీస్‌స్టేషన్లను కరీంనగర్ అడిషనల్ డీసీపీ భీమ్‌రావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. పోలీసుల పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు కక్షిదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రవర్తించాలని సిబ్బందికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మున్నూరుకాపులు రాజకీయంగా ఎదగాలి

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలో మున్నూరుకాపు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామ, పట్టణ అధ్యక్షుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో సఖ్యాపరంగా మున్నూరు కాపు జనాభా లెక్కల్లో స్పష్టత లేదని, అన్నిరంగాల్లో మున్నూరు కాపు కులస్తులు వెనకబడిపోయారని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మున్నూరు కాపు కులస్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మున్నూరుకాపు కులస్తులు రాజకీయంగా మరింత ముందుకు దూసుకుపోవాలని, రాజకీయాలను ప్రక్షాళన చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తంరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, జెన్ వెంకట్, బక్క వేణుగోపాల్, జిల్లా గౌరవాధ్యక్షులు గంగుల సుధాకర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మ రాధాకిషన్, నలువాల రవీందర్, ఉపాధ్యక్షులు కర్ర రాజశేఖర్, పురుమల్ల శ్రీనివాస్, బొమ్మరాతి రాజేశం, ముప్పిడి సునీల్, సత్తినేని శ్రీనివాస్, బొల్లం లింగమూర్తి, దామరకొండ సంతోష్, బంది దీపక్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మున్నూరుకాపు సంఘం నాయకులు

రేపు దాశరథి శత జయంతి సదస్సు

కరీంనగర్ కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మహాకవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతి సదస్సు, కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెరసం బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా ఎంఎల్ఏ గంగుల కమలాకర్, వక్తలుగా గన్నమరాజు గిరిజా మనోహర్‌బాబు, డాక్టర్ తిరునగరి శరత్‌చంద్ర, అతిథులుగా డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, అన్నాడి గజేందర్‌రెడ్డి, డి రాజారాంమోహన్ హాజరౌతారని పేర్కొన్నారు. కవులు, రచయితలు ఒక కవిత లేదా మూడు పద్యాలతో హాజరై విజయవంతం చేయాలని కోరారు